క్లుప్తంగా

ఆర్‌యూబీని పరిశీలించిన ఎలక్ట్రికల్ డీఈ ఫణికుమార్



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీ పనులను శుక్రవారం ఎలక్ట్రికల్ డీఈ ఫణీకుమార్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆర్‌యూబీ పనులు తుదిదశకు చేరుకోవడంతో సర్వీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ స్థంభాలు ఎక్కడ వేయాలనే విషయంపై చర్చించారు. సాధ్యమైనంత త్వరలోనే విద్యుత్ స్థంభాల పనులు ప్రారంభిస్తామని డీఈ తెలిపారు.

తెలుగు పాటకు జాతీయ గుర్తింపు తెచ్చిన కవి వేటూరి



విజయవాడ కల్చరల్: తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి వేటూరి సుందరరామమూర్తి అని స్వరలయ అధ్యక్షుడు వై సుబ్రహ్మమణ్యం అన్నారు. స్వరలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయా గ్రంథాలయంలో శుక్రవారం వేటూరి జయంతి, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు పాటకు సాహిత్యపు విలువలను తీసుకువచ్చిన కవి వేటూరిగా అభివర్ణించారు. గాయనీ గాయకులు వేటూరి రచించిన సినీ గీతాలను మధురంగా గానం చేశారు.

మహాలక్ష్మమ్మకు ప్రత్యేక పూజలు




పాయకాపురం(విజయవాడరూరల్): శ్రీనిదానంపాటి మహాలక్ష్మమ్మ వారి ఆలయ 14వ వార్షికోత్సవాలు శుక్రవారం రాజీవ్ నగర్లో కనుల పండువగా జరిగాయి. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మమ్మ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందని ఆ తల్లి ఆశీస్సులు ప్రభుత్వంపై ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలలో ప్రావీణ్యం పెంచుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం పెంపొందించుకోవాలని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. దుర్గాపురం గౌతమ్ పబ్లిక్ స్కూల్ నందు ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేతల అభినందన కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలను అభినందించారు. పార్టీ నాయకులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై కారు పల్టీ



గుణదల (విజయవాడ తూర్పు): మితిమీరిన వేగంతో కారు నడిపిన ఓ వ్యక్తి జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించాడు. మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారావు కాలనీ పటమటకు చెందిన అజిత్ అగర్వాల్ తన వ్యక్తిగత పనుల నిమిత్తం బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వైపు వెళుతున్నాడు. ఏపీ 40 ఆర్ 2331 నంబరు వైట్ కియా కారులో వెళ్తుండగా జాతీయ రహదారిపై మెట్రోపాలిటన్ హోటల్ వద్ద డివైడర్ స్టోన్‌కు ఢీ కొన్నాడు. పెద్ద శబ్దంతో కారు పల్టీ కొట్టింది. ఘటనలో అజిత్‌అగర్వాల్‌కు గాయాలయ్యాయి. మాచవరం పోలీసులు అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన సుందరకాండ పారాయణం

విజయవాడ కల్చరల్: శ్రీ సీతారామ కల్యాణం జగత్ కల్యాణ కారకమని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ప్రోలాప్రగడ శ్రీనివాస్ అన్నారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యాన మొగల్రాజపురంలోని సిద్ధార్థ కళాశాల ఆవరణలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణం శుక్రవారం ముగిసింది. శ్రీనివాస్ మాట్లాడుతూ సీతారాములను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రామాయణం భారతీయ ఆత్మగా అభివర్ణించారు. లోకేశ్వరాచార్యుల బృందం ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు.

భారత రాజ్యాంగం ప్రతిఒక్కరికీ మార్గదర్శకం

ఘనంగా గణతంత్ర వేడుకలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగం ప్రతీ పౌరుడికి మార్గదర్శకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం సత్యనారాయణపురం గాయత్రీ కల్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే విష్ణు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యున్నతమైనదన్నారు. ప్రజలైనా, పాలకులైనా, అధికారులైనా రాజ్యాంగబద్ధంగా వారి పాత్రలను నిర్వర్తించాలని, అప్పుడే తగిన గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని విలువల కోసం ప్రతి ఒక్కరూ పాటుపడుతూ గణతంత్ర దినోత్సవ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎందరో పోరాటయోధుల ఆత్మార్పణ ఫలమని, అటువంటి మహనీయుల త్యాగాలను స్మరించుకుని వారి ఆదర్శాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, కొంగితల లక్ష్మీపతి, పార్టీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, చల్లా సుధాకర్, జేకే సుబ్బారావు, లంకా బాబు, యల్లాప్రగడ సుధీర్, సనత్, కొండా, చాంద్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు

బీసెంట్ రోడ్డులో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బీసెంట్ రోడ్ మేనకా హోటల్ ఎదురు కొత్త జెండా సెంటర్ వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది చాన్‌బాషా, నాయకులు ప్రతాప్, గయాజ్, దుర్గ, బషీర్, మనోజ్, నసీమ్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి జమల పూర్ణమ్మ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకొంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె రమాదేవి, సిబ్బంది వై.ధనలక్ష్మీ, డీ రమేష్ , కే రాంబాబు, జే శంకర్, కుమార్, ఫణి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యాన గణతంత్ర వేడుకలు జరిగాయి. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మట్టా జయకర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోతుకూరి వెంకటేశ్వరరావు, మాజీ సైనికుడు చెరుకూరి బాబు, వృద్ధుల సంఘం ప్రతినిధులు కాజా రత్నకుమారి, గణేశ్వరమ్మ, సాంబశివరావు, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ముద్రణాలయంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు ప్రభుత్వ ముద్రణాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముద్రణాలయం డెప్యూటీ జనరల్ మేనేజర్ ఎల్ మోహన్‌కుమార్ జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. తొలుత ఎస్‌పీఎఫ్ ఏఎస్‌ఐ నరసింహారావు సిబ్బంది గౌరవ వందనం చేశారు. అనంతరం పండ్లు మిఠాయిలు పంపిణీ చేశారు. రామకృష్ణాపురంలో ఇందిరా మహిళా మండలి ఆధ్వర్యాన జరిగిన గణతంత్ర దినోత్సవంలో కార్పొరేటర్ బీ జానారెడ్డి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు కే మాధవీలత తదితరులు పాల్గొన్నారు. ముత్యాలంపాడులో అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో సంఘం ఉపాధ్యక్షుడు పీవీ సుబ్బరాజు జెండా వందనం చేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కేఎస్ ప్రసాదరాజు, కోశాధికారి రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. 31వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ పెనుమత్స శిరీష స్థానిక నాయకులతో కలిసి జెండా వందనం చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. అలాగే 32వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు ఒగ్గు గవాస్కర్ జెండా వందనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చింతా పెద్దిరాజు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి జెండా వందనం చేశారు. అధ్యాపకుడు డాక్టర్ కె బాలసుబ్రహ్మణ్యం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. దుర్గాపురంలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి జెండా వందనం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్, కె రాము, జీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్ సీపీఐ శాఖ ఆధ్వర్యాన లోటస్ ల్యాండ్‌మార్క్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో జెండా వందనం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోటస్ ల్యాండ్‌మార్క్ సెక్టార్ వన్ ప్రెసిడెంట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు. మాచవరం దక్షిణ భారత హిందీ ప్రచార సభ బీఈడీ కళాశాలలో జరిగిన వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే చారులత తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో జరిగిన గణతంత్ర వేడుకల్లో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

డీటీసీ కార్యాలయంలో..



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న డీటీసీ పురేంద్ర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. డీటీసీ ఎం.పురేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయజెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శాఖాపరంగా మనమందరం ప్రజలకు అంకితభావంతో సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ వై.ఐశ్వర్యరెడ్డి, మోటార్ వాహన తనిఖీ అధికారులు ఆర్ ప్రవీణ్, వెంకటేశ్వరరావు, జీవీఎస్ఎస్ మూర్తి, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్స్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కార్పొరేటర్ విజయలక్ష్మీ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 61వ డివిజన్ అయితా రాములు స్కూల్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 64వ డివిజన్ బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.



జెండా వందనం చేస్తున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

చిత్తరంజన్ గ్రంథాలయంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో గ్రంథాలయాధికారి సంపత్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం దేశభక్తి గీతాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ మోనికాసుమన్, కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే రవీంద్ర భారతి స్కూల్‌లో జరిగిన వేడుకల్లో ప్రముఖ వైద్యుడు డాక్టర్ శేషసాయి జాతీయ నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు.

అయోధ్యనగర్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణాసంస్థ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు జరిగాయి. సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి గణతంత్ర దినోత్సవం గురించి వివరించారు.



సెయింట్ జాన్స్ స్కూల్‌లో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న చిన్నారి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నందమూరినగర్‌లోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయం, 58, 59వ డివిజన్ల పరిధిలో గణతంత్ర వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే, సెంట్రల్ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ హాజరై జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను సింగ్‌నగర్‌లోని రిజ్వాన్ మస్జీద్ ఎదుట నిర్వహించారు.

సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలోని హరివిల్లు ఫౌండేషన్ కార్యాలయం వద్ద గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట బ్రాంచ్ చీఫ్ అకౌంటెంట్ సురేష్‌బాబు పాల్గొని జెండాను ఎగురవేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.శశికాంత్, సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆక్టోపస్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎస్పీ(అడ్మిన్) ఎం.నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్పీ(ట్రెనింగ్) బి.రవిచంద్రకు ఉత్తమ సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ కేవీవీ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లుకు సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ ఆర్సీ నాయక్, కానిస్టేబుల్ ఎం.సూర్యనారాయణలకు డీజీపీ సిల్వర్ డిస్కులను ప్రదానం చేశారు.



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ప్రభుత్వ ముద్రణాలయంలో జెండా వందనం చేస్తున్న మోహన్‌కుమార్



రామకృష్ణాపురంలో జెండా వందనం చేస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి



జెండా వందనం చేస్తున్న అల్లూరి సాంస్కృతిక సంఘం నేతలు

చుట్టుగుంటలో బోన్ డెన్సిటీ పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): చుట్టుగుంట డాక్టర్ చల్లా హరికుమార్ హాస్పిటల్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని టొరెంట్ ఫార్మా ఆధ్వర్యాన ఉచిత డెన్సిటీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ చల్లా హరికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత బోన్ డెన్సిటీ పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బోన్ డెన్సిటీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మంచి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని తెలిపారు. ఖరీదైన బోన్ డెన్సిటీ పరీక్షలను ఉచితంగా చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో టొరెంట్ ఫార్మా ఏబీఎం రఫీబేగ్, పి.శివసాయికిషోర్ తదితరులు పాల్గొన్నారు.



బోన్ డెన్సిటీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సింగ్‌నగర్‌లో వెలంపల్లి పర్యటన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 58వ డివిజన్‌లోని సింగ్‌నగర్ పీఅండ్‌టీ కాలనీలో ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాస్ ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గంలో పోటీచేసే అర్హత బోండా ఉమాకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుప్పు వ్యాపారం చేసుకునే బోండాకు అన్ని కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పాలని నిలదీశారు. అలాగే జగనన్నపై అక్రమ కేసులు పెట్టి 16 నెలలు జైల్లో ఉంచిన కాంగ్రెస్ పార్టీలో చేరి షర్మిల నోటికి వచ్చినట్లు మాట్లాడటం బాధాకరమని వెలంపల్లి అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్

కేంద్ర ప్రభుత్వ విధానాలతో అన్యాయం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని మీసాల రాజారావు వంతెన నుంచి పడవల రేవు వరకు ట్రాక్టర్‌లు, బైక్‌లు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతాంగానికి మద్దతు ధర చట్టం తెస్తామన్న హామీ ఉల్లంఘించి తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 16న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు, పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ బాబూరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలారి, భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ భాస్కరరావు పాల్గొన్నారు.



బీఆర్టీఎస్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నేతలు

మహిళా పక్షపాతి సీఎం జగన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రామకృష్ణాపురంలో శుక్రవారం ఇందిరా మహిళా మండలి 47వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళ బాగుంటే కుటుంబం తద్వారా సమాజం బాగుపడుతుందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంభనకు కృషి చేస్తున్న ఇందిరా మహిళా మండలి సేవలను అభినందించారు. మహిళా మండలికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అనంతరం మహిళా మండలి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ బీ జానారెడ్డి, లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కేవీ రామారావు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ తదితరులు

ఆత్మహత్యాయత్నం చేసిన తల్లీపిల్లలను కాపాడిన పోలీసులు

పాయకాపురం(విజయవాడ రూరల్): ఆత్మహత్య చేసుకోబోయిన తల్లీపిల్లలను నున్న పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాంబేకాలనీ సీ బ్లాకులో నివసిస్తున్న చిప్ప నాగరాజు, జోత్స్న దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. నాగరాజు సెంట్రింగ్ పనికి వెళ్లివచ్చి మద్యం మత్తులో రోజూ భార్య జోత్స్నను మానసికంగా, శారీరకంగా వేధిస్తుంటాడు. వీటిని భరించలేని ఆమె పిల్లలతో సహా వాంబేకాలనీ సమీపంలో ఉన్న రైలు పట్టాలపై పడుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్ఐ సేనాపతి శ్రీనివాస్, కానిస్టేబుళ్లు నాగరాజు, ఈశ్వరావు అక్కడకెళ్లి జోత్స్నకు నచ్చచెప్పి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు ఆమెను హనుమాన్‌జంక్షన్లో హోమ్‌కు తీసుకెళ్లారు. ఆమె భర్త నాగరాజుపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న నార్త్ ఏసీపీ రవికాంత్ ఎస్ఐ శ్రీనివాస్‌ను, కానిస్టేబుళ్లు నాగరాజు, ఈశ్వరావును అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

కృష్ణలంక(విజయవాడతూర్పు): కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. విశాఖపట్నంకు చెందిన దుమ్మెద ఆదినారాయణకు ఇద్దరు కుమారులు. ఆయన మూడేళ్ల క్రితం మృతిచెందాడు. ఇతని రెండో కుమారుడు వంశీకృష్ణ(25) పదో తరగతి చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. దీంతో కుటుంబసభ్యులు మందలించడంతో రెండు సార్లు ఆత్మహత్య యత్నం చేశాడు. ఈ క్రమంలో ఏడాది క్రితం రాణిగారితోట, తమ్మిన పోతురాజు వీధిలో నివసిస్తున్న ఆదినారాయణ సోదరుడు దుమ్మెద పైడిరాజు వంశీకృష్ణను ఆటోనగర్‌లో అతను చేస్తున్న ముఠాపనిలో పెట్టాడు. ఐదు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం సేవిస్తూ తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు అతనిని మందలించారు. రోజులాగానే గురువారం పనికి వెళ్లగా వంశీకృష్ణ ఇంటివద్దనే ఉన్నాడు. పైడిరాజు కుమారుడు సిద్ధు ట్యూషన్‌కు వెళ్లి రాత్రి 9 గంటల సమయంలో ఇంటికి వచ్చి తలుపు తీసి లోపలకి వెళ్లాడు. వంశీకృష్ణ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని కనిపించాడు. సిద్ధు కేకలు వేయడంతో స్థానికులు వంశీకృష్ణను కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్ చుట్టుగుంట సబ్ స్టేషన్ 11 కేవీ సీతారామపురం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్ర ప్రెస్ రోడ్, బోయపాటివారి వీధి, కడియాలవారి వీధి, బెల్లపుశోభనాద్రివీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, కోవెలమూడివారి వీధి, దాసరివారి వీధి, స్వాతిప్రెస్ ఏరియా, సూర్యనారాయణ వీధి, ఎంజే నాయుడు హాస్పిటల్ ఏరియా, పాపయ్య వీధి, బారిస్టర్ వీధి, నేతాజీ వీధి, శ్రీనివాసరావు వీధి, బీజేపీ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ తోటవారి ఫీడర్ పరిధిలో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

అనాథలకు బెడ్‌షీట్లు, టవల్స్ అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఎక్స్ పారామిలిటరీ వెల్ఫేర్ అసోసియేన్ ఆధ్వర్యంలో శనివారం కృష్ణలంకలోని నిర్మల శిశుభవన్‌లోని అనాథలకు బెడ్‌షీట్లు, టవల్స్, తినుబండారాలు పంపిణీ చేశారు.